
ఐస్‌క్రీమ్, పండ్ల రసాలతో జాగ్రత్త!

- కలుషిత నీరు, రసాయనాలతో తయారీ
- కల్తీకి పాల్పడుతున్న నిర్వాహకులు
- తక్కువ ధర పేరు చెప్పి విక్రయాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


కాజీపేటలో విక్రయిస్తున్న శీతల పానీయాలు


రహదారి పక్కన నిల్వ చేసిన ఐస్ గడ్డలు

కాజీపేట: వేసవి కాలంలో శీతల పానీయాలకు ఉన్న డిమాండ్ అంతాఇంత కాదు. ఇదే అదనుగా భావిస్తున్న కొంతమంది నిర్వాహకులు యథేచ్ఛగా కల్తీ చేస్తున్నారు. డొల్ల కంపెనీలు పెట్టి ఐస్‌క్రీమ్‌లు తయారు చేసి విక్రయిస్తూ రెండు చేతులా అర్జిస్తున్నారు. ఈక్రమంలో నాణ్యతను పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అనారోగ్యం బారిన ప్రజలు

ఐస్‌క్రీమ్‌లను పిల్లల నుంచి మొదలుకొని పెద్దల వరకు అందరూ ఎంతో ఇష్టపడతారు. ప్రధానంగా వేసవిలో మండుటెండల్లో తిరిగే వారు ఐస్‌క్రీమ్‌లు, పండ్ల రసాలు, సోడాలు తాగి సేదతీరుతారు. అయితే పట్టణ పరిసర గ్రామాల్లో అమ్ముతున్న ఐస్‌క్రీమ్‌లు, పండ్ల రసాలు కల్తీ అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వేసవిలో ఎండలను భరించలేని ప్రజలు తాపంతో వాటిని తాగుతూ అనారోగ్యాల బారినపడి ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నవారూ ఉన్నారు. నాణ్యత లోపించిన ఐస్‌క్రీమ్‌లు, పండ్ల రసాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

నాణ్యత లేని ఐస్‌క్రీమ్‌లు

వేసవిలో ఐస్‌క్రీమ్‌లకు ఉండే డిమాండ్ దృష్టిలో ఉంచుకొని మార్కెట్‌లో వ్యాపారులు నాలుగు కాసులకు కక్కుర్తిపడి నాసిరకం, నాణ్యత లేని ఐస్‌క్రీమ్‌లు తయారు చేసి బజార్లలో విక్రయిస్తూ ఇబ్బడిముబ్బడిగా సంపాదిస్తున్నారు. వాటి నాణ్యతను గుర్తించడం ఎవరికి అంతా ఈజీ కాదు. కొన్ని కంపెనీలు బ్రాండ్ కంపెనీని పోలిన ప్యాకింగ్‌లను చేస్తూ అమ్ముతున్నాయి.

కలుషిత జలాలతో ఐస్ తయారీ

పండ్ల రసాలలో వాడే ఐస్‌ను ఉప్పునీటితో తయారు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఐస్ తయారీ కేంద్రాలు పని చేస్తున్నాయి. కలుషిత జలాలతో ఐస్ తయారు చేస్తున్నట్లు సమాచారం. వాటిపై సంబంధిత అధికారుల నిఘా కరువైందని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు.

నాసిరకంగా పండ్ల రసాలు

ట్రైసిటీగా పిలువబడే వరంగల్ నగరంలో ఎక్కడ చూసినా పండ్ల రసాల బండ్లు దర్శనమిస్తున్నాయి. అయితే వాటిలో నాణ్యతా ప్రమాణాలను ఏ మాత్రం పాటించడం లేదు. ఫ్రూట్ సలాడ్‌ల పేరిట చెడిపోయిన పండ్లను వాడుతున్నారు. తక్కువ ధర అని ప్రజలు వాటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి తగు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఉండాలి



పండ్ల రసాలు, ఐస్‌క్రీమ్‌లు, ఐస్ తయారీ కేంద్రాలపై సంబంధిత అధికారుల నిఘా ఉండాలి. తరచూ పర్యవేక్షణ చేస్తూ నీటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించాలి. తేడాలు వస్తే సదరు వ్యాపారులపై కేసులు నమోదు చేయాలి. అప్పుడే కల్తీ నుంచి ప్రజల ఆరోగ్యాలకు కాపాడవచ్చు.

– సుంచు చిన్న అశోక్, సోమిడి

బార్ ఏర్పాటు చేయొద్దని ఆందోళన


నిరసన తెలుపుతున్న స్థానికులు

కాజీపేట: జనావాసాలతో పాటు దేవాలయాల సముదాయం ఉన్న ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం తగదని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు రాజకీయ పార్టీలకు అతీతంగా ధర్నా నిర్వహించారు. కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ – వడ్డెపల్లి ట్యాంక్ బండ్ ప్రధాన రహదారిపై కాలనీవాసులు మంగళవారం దీక్షకు కూర్చున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు గొట్టిముక్కుల రమణారెడ్డి, నార్లగిరి రామలింగం మాట్లాడుతూ జిల్లా అధికారులు స్పందించి బార్ ఏర్పాటు అనుమతులను రద్దు చేయాలని, లేకుంటే ఎక్సైజ్ కార్యాలయం ముట్టడిస్తామంటూ హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కుమ్మరి కోటిలింగం, మర్రిపెల్లి సుధాకర్, కట్కూరి సుదర్శన్ రెడ్డి, మంద గోపాల్ రెడ్డి, కొట్టె విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కాకతీయుల చరిత్రను కాపాడుకోవాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపేంద్రశర్మ, తదితరులు

నయీంనగర్: కాకతీయుల చరిత్ర మరుగున పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బ్రాహ్మణ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు, వేయిస్తంభాల దేవాలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ గుర్తుచేశారు. మాజీ కార్పొరేటర్ రావుల సుదర్శన్ రచించిన కాకతీయ సమగ్ర చరిత్ర పుస్తకాన్ని హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఉపేంద్రశర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ కాకతీయుల చరిత్ర గోల్కొండ కోట నుంచి తమిళనాడు వరకు ఉందని, ఇప్పటికీ గుంటూరు జిల్లాలో ఆధారాలు ఉన్నాయన్నారు. 1163వ సంవత్సరం నుంచి కాకతీయుల చరిత్ర ఉందని, ఆధ్యాత్మికంగా ఉండాలని 180 దేవాలయాలను కాకతీయులు నిర్మించారని అందులో రామప్ప, వేయి స్తంభాల గుడి, త్రికూటలయాలు ఉన్నాయని వివరించారు. రైతులు సుభిక్షంగా ఉండాలని గొలుసు కట్టు చెరువులు నిర్మించారని చెప్పారు. రచయిత రావుల సుదర్శన్ మాట్లాడుతూ కాకతీయుల చరిత్రను సమాజానికి అందించాలని కాకతీయుల సమగ్ర చరిత్ర పుస్తకాన్ని రాసినట్లు తెలిపారు. 35 ఏళ్ల నుంచి కాకతీయుల చరిత్రపై అధ్యయనం చేస్తూ మూడేళ్లు శోధించి పుస్తకాన్ని రాసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పులి రజనీకాంత్, బండారి రాజు, రవికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రుతుస్రావంలో మహిళలు అపోహలకు గురికావొద్దు

ఎంజీఎం: రుతుస్రావంలో ఉన్న స్త్రీలు అపోహలకు గురికావొద్దని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు తెలిపారు. బహిష్టు సమయంలో కలిగే అపోహలపై వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం మే 28వ తేదీన రుతుస్రావ ఆరోగ్యం, ప్రాముఖ్యత రుతుక్రమంపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకుబ్‌పాషా, డీఐఓ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవంపై 15 నుంచి 45 ఏళ్లలోపు స్త్రీలకు మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

వ్యవసాయ ప్రణాళికను పక్కాగా రూపొందించాలి

న్యూశాయంపేట: రాష్ట్ర ప్రభుత్వం పక్కా వ్యవసాయ ప్రణాళికను రూపొందించాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య సూచించారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చుక్కయ్య మాట్లాడారు. గత ప్రభుత్వం 2021వ నాటికి వ్యవసాయ ప్రణాళికను అటకెక్కించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇప్పటి ప్రభుత్వం ఏకకాలంతో రుణమాఫీ చేయాలని కోరారు. వచ్చేనెల 6న హనుమకొండ సుందరయ్య భవన్‌లో రైతాంగ సమస్యలపై సమావేశంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు బండి పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మసాగర్ మండలం మల్లకపల్లి గ్రామానికి చెందిన మునిగాల వెంకటేశ్వర్లు (48) కాజీపేట మండలం తరాలపల్లి గ్రామంలోని ఓ క్వారీలో పని చేస్తున్నాడు. ఈ నెల 27న రోజు మాదిరిగానే పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్త ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై రాజబాబు తెలిపారు. మృతుడి భార్య మునిగాల రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కొండగట్టుకు మాలధారుల పాదయాత్ర



మడికొండ: మడికొండ పెద్దమ్మ ఆలయం నుంచి వేములవాడ – కొండగట్టు దేవాలయం వరకు హనుమాన్ మాలధారులు సోమవారం రాత్రి పాదయాత్రగా బయలుదేరారు. పాదయాత్రలో దువ్వ నవీన్, కుక్కల రాజేంద్రప్రసాద్, కుమారస్వామి, ఆకుల శ్రీకాంత్, ఆకుల శరత్, బోగి అనిల్, కొత్తకొండ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయంలో పూజలు



మడికొండ: ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన కూటమి గెలుపొందాలని కోరుతూ మడికొండలోని ప్రసన్నాంజనేయ స్వామికి అర్చకుడు మంత్రవాది వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ, అజయ్, విజయ్, శ్రీను, రామస్వామి, తరుణ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మామిడి పండ్ల రసంతో శ్వేతార్కుడికి అభిషేకం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మామిడి పండ్ల రసంతో గణనాథుడికి అర్చకులు మంగళవారం అభిషేకం చేశారు. భక్తులు సమర్పించిన మామిడి పండ్ల రసంతో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకం చేశారు. సాయికృష్ణ శర్మ.. వరుణ హోమం జరిపించారు. తీర్థ ప్రసాదాల వితరణ అనంతరం అన్నపూర్ణ భవనంలో భక్తులకు అన్నదానం చేశారు.

'కపిలవాయి' స్మారక అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న కృష్ణమాచార్యులు

హన్మకొండ కల్చరల్: ప్రసిద్ధ కవి రచయిత డాక్టర్ కపిలవాయి లింగమూర్తి స్మారక అవార్డును నగరానికి చెందిన విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ధర్మపీఠం సంచాలకుడు, కవి, రచయిత చొల్లేటి కృష్ణమాచార్యులు అందుకున్నారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత వేలు ఆనందాచారి, ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, రచయిత్రి దాసోజు లలిత, కపిలవాయి లింగమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొని కృష్ణమాచార్యులను సన్మానించి అవార్డు ప్రదానం చేశారు. గతంలో కృష్ణమాచార్యులు సాహిత్య రత్న, సేవారత్న వంటి పురస్కారాలు అందుకున్నారు. నీరాజనం, తెలంగాణ అమరవీరుల స్వర్ణాక్షర నివాళి, విశ్వకర్మ పురాణం, ఉపనిషత్తుల సంకలనం, ఆచార్య నాగార్జున విశ్వబ్రహ్మ చరిత్ర వంటి చారిత్రాత్మక నవల రచించినందుకు అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విశ్వనాథుల పుష్పగిరి, తెలంగాణ తల్లి విగ్రహ రూపశిల్పి డాక్టర్ బైరోజు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే అభివృద్ధి నిలిచింది

- కార్పొరేటర్ వేముల శ్రీనివాస్
- సాక్షి కథనంపై వివరణ

సాక్షి స్పందన

హన్మకొండ చౌరస్తా: మూడేళ్ల క్రితం కాకాజీకాలనీలోని వీణా మెడికేర్ ఆస్పత్రి నుంచి సులభ్ కాంప్లెక్స్ వరకు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన నాలా అభివృద్ధి పనులు.. కాంట్రాక్టర్ వినయ్‌రెడ్డి ముందుకు రాకపోవడంతోనే నిలిచిపోయాయని 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ పేర్కొన్నారు. 'కాకాజీకాలనీలో కానరాని అభివృద్ధి' పేరుతో ఈనెల 27వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఆయన మంగళవారం వివరణ ఇచ్చారు. మూడేళ్ల క్రితం రాగన్న దర్వాజ పక్కనే ఉన్న దాకలివాడలో రూ.40 లక్షల ఖర్చుతో నిర్మించాల్సిన రోడ్డు, డ్రెయినేజీ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ స్పందించకపోవడంతో పనులు ముందుకు సాగలేదన్నారు. హంటర్‌రోడ్డు నుంచి వచ్చే వర్షపు నీరు కాకాజీకాలనీ మీదుగా ప్రధాన నాలాలో కలుస్తోందని, ఈక్రమంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాకాజీకాలనీలో వరదనీరు నిలుస్తోందని తెలిపారు. అందుకు శాశ్వత పరిష్కారం త్వరలోనే చూపుతామని అన్నారు. 2016లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన తనను ప్రజలు గెలిపించారని, అప్పటి నుంచి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సమస్యలు పరిష్కరించానని కార్పొరేటర్ శ్రీనివాస్ వివరించారు. ఏ సమస్య ఉన్నా ప్రజలు తన దృష్టికి తీసుకురావాలన్నారు.

అభాగ్యుల ఆకలి తీర్చడం అభినందనీయం


వాహనాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

హన్మకొండ: నగరంలో ఫుట్‌పాత్‌ల వెంట ఆవాసం ఏర్పర్చుకున్న నిరుపేదలు, అభాగ్యులు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌ల వద్ద భిక్షాటన చేస్తున్న పేదలకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆకలి తీర్చడం అభినందనీయమని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ అన్నారు. ఈనెల 28న వరల్డ్ హంగర్ డేను పురస్కరించుకుని మలబార్ డైమండ్స్ అండ్ గోల్డ్ హనుమకొండ స్టోర్స్ ఆధ్వర్యంలో ప్రతిరోజు నిరుపేదలు, పేదలు, ఆస్పత్రిలోని రోగులకు 300 ఆహార పొట్లాలు అందించే కార్యక్రమాన్ని హనుమకొండ నక్కలగుట్టలోని మలబార్ స్టోర్స్ వద్ద ఏసీపీ సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఆహార పొట్లాలు తీసుకెళ్లిన్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ డైరెక్టర్ అజీస్ అహ్మద్, మార్కెటింగ్ మేనేజర్ వంశీ మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లోని కొన్ని ప్రాంతాలతో పాటు, దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలతో సహా 16 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న 70 నగరాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు, మలబార్ సిబ్బంది పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఎన్టీఆర్


హన్మకొండ: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

హన్మకొండ: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని అఖిల భారత నందమూరి తారక రామారావు అభిమాన సంఘం గౌరవాధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎన్టీఆర్‌ఎస్ ప్రాంగణంలో ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, న్యూ శాయంపేట మాజీ కార్పొరేటర్ మాడిశెట్టి శివశంకర్, నాయకులు సిలువేరు కుమారస్వామి, కరిమిల్ల సంపత్ రావు, భూపతోయిన సంపత్ యాదవ్, కరిమిల్ల వెంకటేశ్వరావు, చిమ్మని గోపి పాల్గొన్నారు.

నూతన చరిత్రకు నాంది పలికిన వ్యక్తి

వరంగల్: తెలుగు సినిమా రంగం, దేశ రాజకీయ రంగాన్ని మలుపు తిప్పి నూతన చరిత్రకు నాంది పలికిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని టీడీపీ 14వ డివిజన్ అధ్యక్షుడు పాశికంటి రమేష్ అన్నారు. 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్‌నగర్‌లో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. టీడీపీ డివిజన్ ఉపాధ్యక్షుడు ముంద్రాతి శరత్, కార్యదర్శి లాసాని నర్సింగరావు, ఎన్టీఆర్ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నగేష్, కోశాధికారి కుమార్, ప్రతినిధులు ల్యాగల భిక్షపతి, ఈర్ల రాజు, అంజయ్య, కృష్ణమూర్తి, వీరమల్లు, డాక్టర్ రాజేందర్, అశోక్ పాల్గొన్నారు.

కాజీపేట: ఎన్టీఆర్ జయంతిని కాజీపేట చౌరస్తాలో కార్యకర్తలు జరుపుకున్నారు. వరంగల్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బర్ల యాకుబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్గం సారంగం, కాగితాల జయశంకర్, బైరి శేషాద్రి, బైరపాక ప్రభాకర్, అనిశెట్టి సతీష్, నాయకులు చిలువేరు మహేష్, కోంద్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని అఖిల భారత నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం కన్వీనర్ జీఎల్.శ్రీధర్ కొనియాడారు. ఫోర్ట్ రోడ్డు రుద్రమాంబ నగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ వరంగల్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నల్లకుంట రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్టీ రామారావు జయంతి వేడుకల్లో నాగవెల్లి సురేష్, సంపత్, నల్లకుమార్, పొన్నం కుమార్, గూడూరు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధి అందరి బాధ్యత



కేయూ క్యాంపస్: గత మూడేళ్లలో కాకతీయ యూనివర్సిటీలో అకడమిక్ పాలన మందగించిందని, ఈక్రమంలో వర్సిటీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి సూచించారు. యూనివర్సిటీలో నిరంకుశ తరహా పాలన ముగిసిందని, అకడమిక్ పరంగా గత మూడేళ్లలో నష్టపోయిన అధ్యాపకులందరికి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు అకుట్ ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరి, కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రమేష్‌తో కలిసి కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ బాటనీ విభాగంలో రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ విభాగం అధిపతిగా కాంట్రాక్టు లెక్చరర్‌కు బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆ విభాగేతర అధ్యాపకుడిని బీఓఎస్ చైర్మన్‌గా నియమించారన్నారు. ఇంగ్లిష్ విభాగంలో బీఓఎస్‌ను ఆ విభాగం అధ్యాపకులనే నియమించాలని చెప్పారు. యూనివర్సిటీ లా కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్‌కు పీహెచ్‌డీ విద్యార్థులను కేటాయించాలన్నారు. గణితశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భారవీశర్మను నియమించాలని, ఫిజికల్ విభాగంలో రొటేషన్ పద్ధతిలో విభాగం అధిపతిని నియమించాలన్నారు. అధ్యాపకుల బదిలీలకు విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. యూనివర్సిటీ అకడమిక్ అభివృద్ధికి అకుట్ సహకరిస్తుందని వివరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత




వరంగల్: పోగొట్టుకున్న ఫోన్లను నూతన సాంకేతిక పరిజ్ఞానం (సీఈఐఆర్) సహకారంతో పోలీసులు వెతికి పట్టుకుని బాధితులకు అప్పగిస్తున్నారు. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల స్టేషన్ పరిధిలో పలువురు వ్యక్తులు సెల్‌ఫోన్లు పోగొట్టుకుని తమకు ఫిర్యాదు చేశారని, దాంతో కేసు నమోదు చేసిన తమ సిబ్బంది ఏనుమాముల టెక్నికల్ టీమ్ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్లను వెతికి పట్టుకున్నట్లు తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌తో కలిసి బాధితులను పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం పిలిపించి ఫోన్లను అందజేసినట్లు వివరించారు. దాకచక్యంగా విధులు నిర్వహించిన కానిస్టేబుల్ విజయ్‌కుమార్‌ను ఈ సందర్భంగా సీఐ అభినందించారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన

ఐనవోలు : ఐనవోలు, పున్నేలు, వెంకటాపూర్, కొండపర్తి, వనమాల కనపర్తి, లింగమోరిగూడెం, ఉడుతగూడెం గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక రైతువేదికలో ఎంఏఓ కవిత మాట్లాడుతూ అన్నదాతలు లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోను కొనుగోలు చేయరాదన్నారు.

నూతన ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలి



న్యూశాయంపేట: యువత తమ సమయాన్ని వృథా చేయకుండా నూతన ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) తెలంగాణ అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ కోరారు. ఎస్ఐఓ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన మూడు రోజుల వేసవి శిక్షణ తరగతులు వరంగల్ జాన్‌పాక్ షహీద్‌లో మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హఫీజ్ మాట్లాడుతూ చెడు వ్యసనాలు, అశ్లీలతలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. సమావేశంలో ఎస్ఐఓ వరంగల్ నగర కార్యదర్శులు హసీబ్, జకారియా, హంజా అబ్దుల్లా, ముబీన్ అఫ్రోజ్, ఫుర్కాన్ తదితరులు పాల్గొన్నారు.

సఖి సెంటర్ సేవలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హరిత


విద్యారణ్యపురి: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో బాధిత మహిళలు, బాలికలకు ఐదు రకాల సేవలను అందిస్తున్నట్లు సఖి సెంటర్ కేస్ వర్కర్ హరిత తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ క్రాస్‌రోడ్డు ప్రాంతంలోని హనుమకొండ వసుంధర గర్ల్స్ హాస్టల్‌లో ఇన్‌చార్జ్ లావణ్య ఆధ్వర్యంలో సఖి సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు అంశాలను వారికి హరిత వివరించారు. సఖి సెంటర్ ఉద్దేశాలు, సేవల గురించి తెలియజేశారు. బాధితులకు వైద్య సహాయం, కౌన్సిలింగ్, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి లాంటి సేవలు గురించి వివరించారు. బాధిత మహిళలు, బాలికలు తక్షణ సహాయం రక్షణ కోసం 181, 1098 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనాథ పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ


విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న దాసరి మానస, కుటుంబ సభ్యులు

హన్మకొండ: హనుమకొండ సుబేదారిలోని అనాథ బాలికల ఆశ్రమం బాలసదనం వసతి గృహం విద్యార్థినులకు మంగపేటకు చెందిన దాసరి రాము, మానస దంపతులు వారి కూతురు జ్ఞాపకార్థం లాంగ్ నోట్ బుక్స్, స్టేషనరీ, స్నాక్స్‌ను అందించారు. బాలసదనం వసతి గృహంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థినులకు వాటిని అందించారు. అనంతరం శిశుగృహాలోని పిల్లలకు పండ్లు, బిస్కట్లు, కేక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కరుకాల అనితారెడ్డి, రిటైర్డ్ సీడీపీఓ విజయలక్ష్మి, బాలసదనం నిర్వాహకురాలు రాజేశ్వరి, గోకారపు మానిక, చరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి లక్ష పుష్పార్చన




అమ్మవారికి లక్ష పుష్పార్చన చేస్తున్న మహిళలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయం నిర్వహిస్తున్న వార్షికోత్సవాల్లో భాగంగా రెండవరోజు మంగళవారం వైశాఖమాసం బహుళ పంచమి తిథి రాజరాజేశ్వరి దేవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి లక్ష పుష్పార్చనను శోభాయమానంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం 108 కలశాలతో 53 రకాల సుగంధ ద్రవ్యాలతో 135లీటర్ల ఆవుపాలతో అమ్మవారికి విశేష అభిషేకం జరిపించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేస్తుండగా తొమ్మిది రకాల పుష్పాలతో పుష్పార్చన చేశారు. అనంతర అన్నప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం పూల ఉంజలి, 300త్రిశతి నామాలతో దీపాలంకరణ చేశారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రంగనాథస్వామి దేవాలయంలో పూజలు


దేవాలయంలో గోపూజ చేస్తున్న భక్తులు



కాశిబుగ్గ: వైశాఖ మాసం హనుమాన్ జయంతి ఆఖరి మంగళవారాన్ని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని పురాతన రంగనాథస్వామి దేవాలయంలోని దక్షిణముఖ అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి రూ.11 వేల (రూ.20, రూ.10) కరెన్సీ నోట్లతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో గోపూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు, అధ్యక్షులు వంగరి రవి, చిలువూరి సురేష్, మాటం శ్రీనివాస్, ప్రకాష్‌రెడ్డి, సమ్మయ్య, నీలం శ్రీనివాస్, రాగుల ప్రసాద్, రమేష్, రోజా, సృజన పాల్గొన్నారు.